పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

ఘనంగా అమరజీవి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం అని వక్తలు తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రొద్దుటూరులోని లైట్ పాలెంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సభ వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్య వైశ్యసభ కార్యదర్శి నాగేశ్వరరావు, సుబ్రమ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తెలుగు వారికి చేసిన సేవలు, గొప్పతనాన్ని పలువురు వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, మాజీ వైమానిక దళ అధికారి వెంకట కొండయ్య, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, రమణారెడ్డి, శ్రీనివాసులు, రవిచంద్ర, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఆవరణలో..

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి అమరులయ్యారని ఫైర్ ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్లు నారాయణరెడ్డి, రాజేంద్రకుమార్, ఫైర్‌మెన్లు బాలయ్య, పుల్లయ్య, జిలాని, డ్రైవర్ ఆపరేటర్ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, కార్యదర్శి బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షులు జి.పుల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ప్రసాద్, నరసరాజు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

అమరజీవి విగ్రహానికి పాలాభిషేకం

మైదుకూరు : స్థానిక అమ్మవారిశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఆర్యవైశ్య సభ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి పొట్టి శ్రీరాములు చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కూడలి వద్ద అమరజీవి విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్, యలవలి హరికిషన్, దొంతు వెంకట సుబ్బయ్య, డీవీ సునీల్, ఎలిశెట్టి ప్రసాద్, ఆవోపా అధ్యక్షుడు దరిశా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొప్ప మహనీయుడని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇందిరా క్రాంతి పథం ఏపీఎం వెంకటరమణ, గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి జానకీరామ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు : పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సభ నాయకులు



బద్వేలు అర్బన్ : అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫైర్ సిబ్బంది

క్లుప్తంగా

వైభవంగా గోవిందమాంబ ఆరాధన



అమ్మవారికి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ వెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల వారి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం ద్వారపూజ కార్యక్రమం చేపట్టారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకుని తరించారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు, దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి ప్రకాష్ నగర్‌లోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు, లోకకల్యాణార్థం కలశ పూజ, గణపతి, నవగ్రహ, బాలాత్రిపురసుందరి, చండీ హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా చేశారు. పూర్ణాహుతిగా పట్టువస్త్రాలు, హోమ, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం చౌడేశ్వరి, చౌడేశ్వరుల బిందెసేవ మహోత్సవాన్ని నిర్వహించారు. పూజాకార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. శుక్రవారం ఉదయం అమ్మవారికి విశేష పూజలతోపాటు ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వినియోగం చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు సరస్వతి కోటమరాజు, కార్యదర్శి ధనలక్ష్మి కోరారు.

రేపటి నుంచి నారాయణస్వామి ఆరాధన



అవధూత నారాయణస్వామి విగ్రహం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంసాగర్ వద్ద శ్రీ అవధూత నారాయణ రెడ్డి యోగేంద్ర స్వాముల 109వ ఆరాధన మహోత్సవాలు శనివారం నుంచి జరగనున్నట్లు నారాయణస్వామి మఠం నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. సత్య హరిశ్చంద్ర నాటకం, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న డాక్టర్ సమీర

దువ్వూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సమీర, సురేష్ బాబు పేర్కొన్నారు. దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఆడ పిల్లలను సంరక్షించి, మగ పిల్లలతో సమానంగా చదివించాలని తెలిపారు. బాలికలకు యుక్త వయసులో పెళ్లి చేయాలని చెప్పారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మార్చి 24 నుంచి టీబీ నివారణకు రోగులకు చికిత్స, మందులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్విజ్ పోటీల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాల విద్యార్థినులు జాతీయ పశుశరీర ధర్మ శాస్త్రం (ఫిజియాలజీ) విభాగం సౌత్ జోన్ వారు పుదుచ్చేరిలోని రాజీవ్ గాంధీ పశువైద్యకళాశాలలో ఈ నెల 3న నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ పోటీలకు దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలకు చెందిన 22 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న యశస్వి దుబే, నాలుగో సంవత్సరం చదువుతున్న వి.రాధిక క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపి రెండో బహుమతి సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు, ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మురళినాథ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి రెండో బహుమతి సాధించి కళాశాలకు గుర్తింపు తెచ్చారని విద్యార్థినులను వారు అభినందించారు. విద్యార్థులు ఇటువంటి విజయాలను మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులతో డీన్, ప్రొఫెసర్

గ్రామ సచివాలయ సేవలు వినియోగించుకోవాలి

చాపాడు : గ్రామ సచివాలయ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జమ్మలమడుగు డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు సి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని చాపాడు, పల్లవోలు, లక్ష్మీపేట, పెద్దగురువళూరు, చిన్నగురువళూరు గ్రామ సచివాలయాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు గ్రామాల్లోనే అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ పరమైన ప్రతి సర్వీసు ఇక్కడి నుంచే ప్రజలు పొందాలన్నారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయభాస్కర్, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ సుబ్రమణ్యం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ ఎం.మహదేవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం శ్రీపాద వల్లభ అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో లైబ్రరీకి తన భార్య రాజేశ్వరి జ్ఞాపకార్థం 10 వేలు విలువ చేసే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని, మంచి పుస్తకాలను మించిన స్నేహితులు లేరన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కొండల భరధ్వాజ రెడ్డి, వంశీకృష్ణ, రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు గురప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మహదేవరెడ్డి

19న దుర్గమ్మ ఆలయ చైర్మన్‌కు సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 19న రాష్ట్రసగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళి కోరారు. గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన రెండవ ఆధ్యాత్మిక క్షేత్రమైన కనక దుర్గామాత ఆలయానికి సగర కులానికి చెందిన రాంబాబును చైర్మన్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో సగరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో సగర సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు జోడు విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు వంగనూరు లక్ష్మీనారాయణ, రెడ్డిపల్లి ఆంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాసు మురళి

రక్తదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో లక్ష్మి అనే మహిళ డెలివరికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమవడంతో డీవైఎఫ్ఐ నాయకుడు డేవిడ్ రాజ్ రక్తదానం చేశారు. ఎవరికైనా రక్తం అవసరమైతే సెల్ : 9502494474, 8466007464కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటి వద్దకే తపాలా బీమా సౌకర్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలా జీవిత బీమా సౌకర్యాన్ని ఇకపై ఇంటి వద్ద వచ్చి కల్పిస్తున్నట్లు తపాలా సూపరింటెండెంట్ రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఒక ఫోన్ కాల్ చేస్తే తపాలా సిబ్బంది ఇంటి దగ్గరకు వచ్చి కొత్త పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సేవ కోసం 9966276933, 08564-252816 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరివేసుకున్న షేక్ అబ్దుల్లా

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరివారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని షేక్ అబ్దుల్లా (52) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ విద్యాసాగర్, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ అబ్దుల్లా బి.కోడూరు మండలం మేకవారిపల్లె నుంచి 20 ఏళ్ల క్రితం గుండాపురంలో వివాహం చేసుకుని అక్కడే జీవిస్తున్నాడు. నంది పల్లె వద్ద ఒక చికెన్ సెంటర్‌లో ఆయన పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులకు తెలియకుండా గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. షేక్ అబ్దుల్లాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు

వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 'గోల్స్ ఆఫ్ ఇండియా 2047' అన్న అంశంపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త మణికంఠ తెలిపారు. జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ ప్రోగ్రాంలోభాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9177616677 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

18న జాబ్ మేళా

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శశికాంత్‌రెడ్డి తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్, ట్రైనీ ఉద్యోగాలకు కెమిస్ట్రీ బీఎస్సీ, డిప్లమో, ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ), ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై 19 నుంచి 27 ఏళ్ల ఉన్న పురుష అభ్యర్థులు అర్హులని వారు వివరించారు. 18న శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంక్ బుక్ ఒరిజనల్, జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 9573321678కు సంప్రదించాలని తెలిపారు.

పన్ను బకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ

ప్రొద్దుటూరు : ఆస్తి పన్ను, ఖాళీ జాగాలపై విధించిన బకాయిలను వన్‌టైం (ఒకే సారి) చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ పి.వెంకటరమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీలోపు ఆస్తి పన్ను, ఖాళీ జాగాపై విధించిన పన్ను బకాయిల మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకే సారి చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి చర్యలు

మైదుకూరు : రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రామకృష్ణ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతుండటం మంచి పరిణామమన్నారు. ప్రభుత్వం కేవీకేల ద్వారా ప్రకృతి వ్యవసాయంలో అందిస్తున్న సహాయ సహకారాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఈ విధానంలో వ్యవసాయం చేసి రైతులు పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన 50 మంది రైతులకు ధ్రువపత్రాలను అందజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎం.హర్షిత, బీఎస్ కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్, డీడీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు ధ్రువపత్రాలను అందిస్తున్న శాస్త్రవేత్తలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రతి దుకాణదారుడు తమ దుకాణాల ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక నెల్లూరు రోడ్డులో నిర్వహించిన ఫుట్‌పెట్రోలింగ్‌లో దుకాణదారులతో ఆయన మాట్లాడారు. దుకాణాల్లో చోరీలు జరిగినా, సమీపంలో అనుకోని సంఘటనలు జరిగినా సీసీ కెమెరాలు ఉంటే పూర్తి సమాచారం లభ్యమవుతుందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఎన్నో రకాల నేరాలు నియంత్రించేందుకు సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా స్వర్ణ దుకాణాల యజమానులు, రద్దీ ఎక్కువగా ఉన్న వ్యాపార సముదాయాల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై కూడా వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు సూచనలు ఇస్తున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

19న కవిత్రయ కవితా వైభవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు నందనందన కళానాట్యమండలి ఆధ్వర్యంలో, జార్జిక్లబ్ సౌజన్యంతో కవిత్రయ కవితా వైభవం పేరుతో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షుడు ఎం.రామసుబ్బారెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవధాని నరాల రామారెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, సభాధ్యక్షునిగా చక్రాల లక్ష్మీకాంత రాజారావు, కంద కవి సార్వభౌమ డాక్టర్ రాధశ్రీ, సాహితీవేత్త డాక్టర్ సహదేవుడు, అష్టావధాని సురభి శంకరశర్మ, తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. సభలో సాహితీ అభిమానులు, కళాభిమానులు పాల్గొనాలని రచయిత జింకా సుబ్రహ్మణ్యం కోరారు.



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం

కుక్కలు, కోతులను తరలించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు, కోతులను దూర ప్రాంతాలకు తరలించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కోతులు కూడా ఏవైనా నిత్యావసర సరుకులు, కూరగాయలు తీసుకెళుతున్న ప్రజలపై దాడులు చేస్తూ అడ్డుకోబోతే గాయపరుస్తున్నాయని, వీటిని కూడా పట్టణానికి దూరంగా తరలించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు నాగార్జున, మస్తాన్, షరీఫ్, రమణారెడ్డి, రవికుమార్, ఇమ్మానియేల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణతో క్రమశిక్షణ

కడప ఎడ్యుకేషన్ : స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందుతుందని కడప నగరపాలక కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. గురువారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి కలిశారు. స్కౌట్ అండ్ గైడ్స్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కడప శంకరాపురంలోని స్కౌట్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతో పాలు పలు సమస్యల గురించి జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్‌లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎంఈఓ పాలెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక కమిషనర్‌ను కలిసిన స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

కుందూ తీరం... పంటలు పచ్చదనం



కుందూ నదిలో పారుతున్న నీరు



తొండలదిన్నె-వెలవలి రహదారి మధ్యలో పచ్చగా ఉన్న వరి పైరు

మూడేళ్లుగా కుందూ నదికి, కేసీ చాపాడు, ప్రధాన కాలువలకు నీరు మార్చి చివరి రోజు వరకు వస్తుండటంతో పంట పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌లో వరి, మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటల నూర్పిళ్ల అనంతరం తిరిగి రెండో పంటగా వరి, కొర్ర, నూగు, వేరుశనగ, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంటలు ఏపుగా పెరిగాయి. – రాజుపాళెం